క్లుప్తంగా

సురక్షతో మెరుగైన ఆరోగ్యం



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ వేణుశ్రీలక్ష్మి

రంగంపేట: ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలంతా వినియోగించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని బి.వేణుశ్రీలక్ష్మి సూచించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పెదరాయవరం గ్రామంలోని సచివాలయం వద్ద శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారులు బి.వేణుశ్రీలక్ష్మి, ఆర్.పార్వతి, కంటి వైద్య నిపుణులు ఆర్.నాగేశ్వరరావు 282 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కె. జయమణి, ఎంపీహెచ్‌ఓ పి.ప్రసాద్, పీహెచ్‌ఎన్ ఎల్.గంగాభవానీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సాంబశివరావుకు నివాళి



వెదుళ్లపల్లిలో సాంబశివరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

సీతానగరం: మండలంలోని వెదుళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి సాంబశివరావు వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన కుమారుడు సర్పంచ్ పెందుర్తి బుజ్జియ్య చౌదరి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు విగ్రహానికి బీజేపీ రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భవించిన సమయంలో అప్పటి బూరుగుపూడి నియోజకవర్గం తొలి ఎమ్మెల్యేగా సాంబశివరావు గెలుపొందారన్నారు. ఆయన చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీరుకొండ శ్రీను, కరుటూరి విశ్వనాథం, నీరుకొండ అచ్యుతరామారావు, పెందుర్తి రాజా తదితరులు పాల్గొన్నారు.

ఏరువాక శాస్త్రవేత్తల క్షేత్ర స్థాయి పర్యటన



పంట క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

రాజానగరం: దివాన్‌చెరువులో ఉన్న జిల్లా ఏరువాక కేంద్రం అధికారులు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించారు. రైతులకు సాగుపరంగా సలహాలు, సూచనలిచ్చారు. ఈ మేరకు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, డాక్టర్ పి.అమ్మాజీ, డాక్టర్ ఎస్.హైమజ్యోతి కోరుకొండ, రాజానగరం మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. వరి, మొక్కజొన్న, అపరాల పంటలను పరిశీలించి, రైతులకు సూచనలిచ్చారు.

20 నెలల జీతాలు చెల్లించాలి

డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ సిబ్బంది గగ్గోలు



జీతాల బకాయిల కోసం పురుషోత్తపట్నంలో సమావేశమైన ప్రాజెక్ట్ సిబ్బంది


సీతానగరం: గత 20 నెలలుగా తమకు జీతాలు ఇవ్వలేదని, తక్షణం అందించాలని శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు సిబ్బంది మొరపెట్టుకున్నారు. శుక్రవారం పురుషోత్తపట్నంలోని శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయ్ ప్రాజెక్ట్ వద్ద సిబ్బంది సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పాటి శేషరావు, ప్రధాన కార్యదర్శి కట్టమూరి వీరబాబు మాట్లాడుతూ ఎండాకాలం వచ్చినా జీతాలు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్నామని, తమకు జీతాలందక ఇబ్బందులు పడుతున్నా.. సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. పురుషోత్తపట్నం ప్రాజెక్ట్ పాత కాంట్రాక్టర్ ఐదు నెలలు, కొత్త కాంట్రాక్టర్ ఐదు నెలల జీతాలివ్వాలని, అలాగే కుట్రవాడ ప్రాజెక్ట్ వద్ద సిబ్బందికి 20 నెలల జీతాలు ఇవ్వాల్సి ఉందన్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఇక అప్పులు కూడా పుట్టడం లేదన్నారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చిందన్న నెపంతో, జీతాలిచ్చే పరిస్థితి లేదని చేతులెత్తేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

కల్యాణ వైభోగమే..

- నేడు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం
- తొమ్మిదో శతాబ్దం నాటి దేవాలయం



కోరుకొండలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఆలయం



రంగనాథ స్వామివారు

మధురపూడి: కోరుకొండ అగ్రహారంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామివారి కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి జరుగుతోంది. శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి సమీపంలోని ఆలయంలో.. నిలబడి ఉన్న రంగనాథస్వామిని దర్శించుకోవచ్చు. నరసింహస్వామి దేవస్థానం కంటే పూర్వం తొమ్మిదో శతాబ్దంలోనే స్వామివారి ఆలయాన్ని నెలకొల్పారు. స్వామివారి ఉత్సవాలకు సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరవుతారు.

నేటి రాత్రి కల్యాణం

వైఖానస ఆగమం ప్రకారం కల్యాణం రంగరంగ వైభవంగా జరుగుతోంది. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ఉత్సవాలు జరుగుతాయి. స్వామివారి ఆలయంలో శనివారం రాత్రి 7–30 గంటలకు కల్యాణం ప్రారంభమై, రాత్రి 11 గంటలకు ముగుస్తోంది. ఆలయ అర్చకుడు పెదపాటి నరసింహ గిరిధర్ పర్యవేక్షణలో వేడుకలు జరుగుతాయి. ఈ ఉత్సవాలను శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజు బట్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. తొలుత గోదాదేవి అమ్మవారు, రంగనాథ స్వాములకు మంగళ స్నానాలను నిర్వహిస్తారు. అనంతరం పట్టువస్త్రాల అలంకృతులై పెళ్లి పీటలపై కూర్చుంటారు. వేద పండితుల మంత్రోచ్ఛరణతో కల్యాణం జరుగుతోంది.

నివాస గృహంలా ఆలయం

శ్రీలక్ష్మీనరసింహస్వామి కంటే ముందే రంగనాథ స్వామి నెలకొల్పబడ్డారు. తొమ్మిదో శతాబ్దంలో ఏర్పడిన దేవాలయం నివాస గృహం తరహాలో ఉంటుంది. విదేశీయుల దండయాత్రల బారిన పడకుండా ఉండడానికి పూర్వీకులు నివాస గృహంలా నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం లేకపోవడం విశేషం. అలాగే గాలి గోపురాన్ని ఇటీవల ఏర్పాటు చేశారు. శ్రీరంగనాథస్వామికి అల్లూరి సీతారామరాజు జిల్లా భూపతిపాలెంలో 1,100 ఎకరాల భూమి ఉండేది. ఇదంతా కాలక్రమేణా అన్యాక్రాంతమైంది.

వైఖానస ఆగమం ప్రకారం కల్యాణం



కోరుకొండలోని శ్రీదేవి, భూదేవీ సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవాలు వైఖానస ఆగమం ప్రకారం నిర్వహించబడతాయి. రాత్రి 7–30 నుంచి 11 గంటల వరకూ వేద పండితుల మంత్రోచ్ఛరణతో వివాహ వేడుకలు జరుగుతాయి. ఏటా నిర్వహిస్తున్న పద్ధతిలోనే శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజు బట్టర్ ఆధ్వర్యంలో వేడుకలు జరుగుతాయి.

– పరాసర నరసింహ గిరిధర్, అర్చక స్వామి

వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మిక భావం



శ్రీదేవీ, భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక భావం వెల్లివిరుస్తోంది. కోరుకొండ అగ్రహారంలో శనివారం ప్రత్యేకమైన సందడి ఏర్పడుతోంది. లక్ష్మీనరసింహస్వామి కంటే ముందే రంగనాథస్వామి ఆలయం ఏర్పడింది.

– కేతినీడి అశోక్, స్థానిక భక్తుడు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విస్తృత ప్రచారం



రాజానగరంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాతో మాట్లాడుతున్న వృద్ధుడు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా రాజానగరంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. పార్టీలకతీతంగా ప్రతిఒక్కరినీ కలుసుకుని, రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయానికి తోడ్పడాలని కోరారు. గత ఎన్నికల సమయంలో ప్రజలంతా ఇచ్చిన మద్దతుతోనే భారీ మెజార్టీతో గెలుపొందానని, ఈసారి కూడా అంతకుమించిన మెజార్టీతో విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం స్థానిక మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

నరసింహస్వామికి ఘనంగా సదస్యం

ఆంజనేయ వాహనంపై నృసింహస్వామి గ్రామోత్సవం

మధురపూడి: కోరుకొండలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల మూడో రోజు శుక్రవారం సదస్యం జరిగింది. నవ దంపతులైన స్వామి, అమ్మవార్లను వేద పండితులు ఆశీర్వచనం అందించారు. దేవస్థాన అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ బట్టర్ ఆధ్వర్యంలో స్థానిక కల్యాణ మంటపంలో ఉభయ వేదాంత పండితుల సమక్షంలో సదస్యం జరిగింది. ఈ సందర్భంగా మంత్రోచ్ఛరణతో దేవస్థానం మార్మోగింది. సదస్యం కార్యక్రమంలో బూర్లు ప్రసాద వినియోగం జరిగింది. అనంతరం స్వామివారికి ఆంజనేయ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం కూడా భక్తుల తాకిడి తగ్గలేదు. ఉదయం ఆలయం తలుపులు తెరిచి, ఆరాధన, సర్వదర్శనాలకు అనుమతి కల్పించారు. గ్రామబలిహరణ, ఉదయం 9 గంటలకు స్వామివారి సేవాకాలం, తీర్థ ప్రసాద గోష్ఠి జరిగింది. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీరంగనాథస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుంది.

ప్రపంచ జల దినోత్సవం

రాజానగరం: ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నీటి వినియోగం, పొదుపుపై అవగాహన కల్పించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.రామకృష్ణ పరమహంస అధ్యక్షతన శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. నీటిని పొదుపుగా వాడటం ద్వారా భావితరాలకు నీటి సమస్య ఏర్పడకుండా చూడవచ్చన్నారు. వలంటీర్ సాహిత్య పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నీటి సంరక్షణ పద్ధులు, నీటి పొదుపు–ఆవశ్యకతపై అవగాహన కలిగించారు. అనంతరం అందరూ నీటి పొదుపుపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా, ఆర్.సుశాంతి, సీహెచ్ రమణి, సీహెచ్ పూర్ణలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమస్యలపై అవగాహన ర్యాలీ



సీతానగరం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ఇచ్చిన ఎస్సై, ప్రిన్సిపాల్

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నాగరత్నం కాలనీలో ఐదో రోజు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సామాజిక సమస్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.సుధామయి ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపులో సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీలో బాల్య వివాహాలు, వెట్టిచాకిరి, పౌష్టికాహారం, రక్తహీనత వంటి పలు సమస్యలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీతానగరం ఎస్సై టి.రామకృష్ణ పాల్గొన్నారు. సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆధునిక యుగంలో సైబర్ క్రైమ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోన్లలో వచ్చే లింకులను ఓపెన్ చేయరాదన్నారు. బ్యాంకుల పేర్లతో ఓటీపీ అడిగి, నగదును ఖాతాల నుంచి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని, వీటిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వివరించారు. గురువారం పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు, ఎస్సై రామకృష్ణ ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ మాధవ్, వాణి, అలేఖ్య, మనోహరి, వెంకటేష్ శివప్రసాద్, ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షకు 26 మంది గైర్హాజరు

రంగంపేట: మండలంలోని రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన పదో తరగతి లెక్కలు పరీక్షకు 26 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యా శాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నాలుగో రోజు పరీక్షకు మూడు కేంద్రాల్లోను మొత్తం 636 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 610 మంది హాజరై, 26 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

- చంద్రబాబు ఇక ఇంటికే పరిమితం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ



పురుషోత్తపట్నంలో ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ రాజశ్రీ

సీతానగరం: రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, పారదర్శక పాలన అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు ఖాయమని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ అన్నారు. 2014లో గెలుపొంది.. రాక్షస పాలన అందించిన చంద్రబాబును ప్రజలు తమ ఓటుతో ఇంటికే పరిమితం చేస్తారని చెప్పారు. శుక్రవారం పురుషోత్తపట్నంలో డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ రెండో రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించగా, స్థానిక ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీని గెలిపించడానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఆమె మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో రైతు రుణమాఫీ ఒకటని, ఒక్క రూపాయి రైతు రుణమాఫీ చేయలేదని విమర్శించారు. మొక్కజొన్న రైతులకు క్వింటాలుకు రూ.200 ఇన్‌పుట్ సబ్సిడీగా రైతులకు రూ.20 వేలు అందిస్తానని చెప్పిన చంద్రబాబు, ఒక్క పైసా కూడా విదిల్చలేదని గుర్తు చేశారు. అందుకే 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు గట్టి బుద్ధి చెప్పారన్నారు. వ్యవసాయ రంగాన్ని చంద్రబాబు పాతాళానికి తొక్కేశారని, నీలం తుఫాన్‌కు పరిహారం ఒక్క రూపాయి ఇవ్వలేదని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తక్షణమే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు అనేక సేవలందించారన్నారు. అకాల వర్షాలకు తడిచిన ధాన్యం కొనుగోలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. అలాగే ఇంతవరకూ జరగని రీతిలో మిచాంగ్ తుఫాన్‌తో వర్జీనియా పొగాకు రైతులు నష్టపోతే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిహారం అందించారని కొనియాడారు. వ్యవసాయానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. నవరత్నాల పథకాలను అమలు చేసి, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండేలా పాలన జరిపిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నికల్లో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంపీటీసీ ఉసే ఏసమ్మ, చల్లమళ్ల సుజీరాజు, వెలిచేటి మెహర్‌బాబా, శరత్, గద్దె వీరన్నబాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొండిపాటి కోటేశ్వరరావు, అంబటి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం

- సంక్షేమ పథకాలే గెలుపు అస్త్రాలు
- ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పార్టీ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

అనపర్తి: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వారికి మద్దతుగా వైఎస్సార్ సీపీ మహా శంఖారావం పేరుతో వైఎస్సార్ సీపీ శ్రేణులు శుక్రవారం మండలంలోని పీరా రామచంద్రపురం నుంచి పులుగుర్త వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారని అన్నారు. రాజకీయాల్లో సరికొత్త చరిత్రకు నాంది పలికిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అగ్రపీఠం వేసిన ఏకైక ముఖ్యమంత్రి చరిత్రలో నిలిచారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే వెనుకబడిన తరగతుల వారికి సరైన న్యాయం జరిగిందన్న విషయాన్ని గుర్తించుకోవాలని అన్నారు. అబద్ధపు హామీలతో, పొత్తులతో ప్రజలను మోసం చేయడానికి వస్తున్న టీడీపీని నమ్మొద్దని ప్రజలకు సూచించారు.

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే సార్వత్రిక ఎన్నికల సంగ్రామంలో సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ విజయాస్త్రాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అన్నారు. మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటేనే వైఎస్సార్ సీపీకి ఓటు వేయడంనే దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా సుమారు 3 వేల బైక్‌లతో వైఎస్సార్ సీపీ శ్రేణులు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ పార్టీ శ్రేణులు నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ గౌతమ్‌రెడ్డి, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగన్‌తోనే పేదలకు న్యాయం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి



రంగాపురంలో ప్రచారం చేస్తున్న సత్తి ఆదిలక్ష్మి

బిక్కవోలు: పేదలందరికీ న్యాయం జరగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024లో మళ్లీ అధికారంలోకి రావాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి సత్తి ఆదిలక్ష్మి అన్నారు. శుక్రవారం రంగాపురం గ్రామంలోని ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామస్తులు ఆమెకు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయాలనే ఒక అజెండాతో ప్రజల్లోకి వస్తున్నారని అన్నారు. జగనన్న రాష్ట్రం తన కుటుంబంగా భావించి రాష్ట్రంలో పిల్లలందరూ తన సొంత పిల్లలుగా భావించి వారందరికీ మంచి ఇంగ్లిష్ మీడియం చదువులు అందిస్తున్నారని చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థులకు మంచి మెనూతో కూడినపౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ఏ సమస్యనైనా అక్కడ పరిష్కరిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యే గా తన భర్తను ఎంపీగా డాక్టర్ గూడురి శ్రీనివాస్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలోని సర్పంచి గండికోట వీరభద్రరావు, ఉపసర్పంచి కొమారపు శాంతి కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పిడి మురళీకృష్ణ, నడింపల్లి వాసు రాజు, కేత అప్పన్న బాబు, పార్టీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజి, కాపవరం సర్పంచి సత్యంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కడుపు నిండుగా.. దాతృత్వం మెండుగా..

- సేవకు చిరునామా రెడ్డి పంతులు సత్రం
- కల్యాణోత్సవాల్లో వేలాది మందికి భోజన వసతి



కోరుకొండలోని విరియాల వెంకటరెడ్డి సత్రం



కోరుకొండ సత్రంలో భోజనం చేస్తున్న భక్తులు

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండలో విరియాల వెంకటరెడ్డి పంతులు సత్రం సేవకు చిరునామాగా నిలిచింది. శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భక్తులకు భోజన వితరణ ఈ సత్రం ప్రత్యేకత. కోటికేశవరం గ్రామానికి చెందిన వెంకటరెడ్డి సంకల్పంలో భాగంగా 1918లో దీనిని నెలకొల్పారు. అప్పటి నుంచి ఉత్సవాల సందర్భాల్లో నేటికీ వేలాది మంది భక్తులకు భోజనం అందిస్తున్నారు. ఉత్సవాలు ముగిసే వరకూ స్వామివారి కల్యాణానికి వచ్చిన వేలాది మంది భక్తులకు సంతృప్తిగా భోజనం అందిస్తుంటారు.

ఐదు రోజులూ నిరంతరాయంగా..

నరసింహస్వామి కల్యాణ ఉత్సవాలు నిర్వహించే ఐదు రోజులూ భక్తులకు సత్రంలో భోజన సదుపాయం ఉంటుంది. ఈఓ పాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు భోజనాన్ని సమకూరుస్తారు. ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అన్నసమారాధన జరుగుతోంది. బుధవారం నుంచి శుక్రవారం వరకూ వేలాది మందికి భోజనాన్ని అందించారు.

తరిగిన ఆస్తి

రెడ్డి పంతులు సత్రం ఆస్తంతా తరిగిపోయింది. దాదాపు 20 వేల ఎకరాల పొలాలు సత్రానికి ఆస్తిగా ఉండేవి. నేడు 123.53 ఎకరాలకు తగ్గిపోయింది. సీతానగరం మండలం నల్లగొండలో 20 వేల ఎకరాల ఆస్తి ల్యాండ్ సీలింగ్‌లో పోయింది.

జగన్ సారథ్యంలోనే మహిళాభ్యున్నతి

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించగలరని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి తన కుమారుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేసిన అభివృద్ధిని, లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల ఫలాలను వివరించారు. ఎవరికైనా సమస్యలుంటే వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. తన కుటుంబమంతా ప్రజలకు సేవలందిస్తామన్నారు. ప్రజల ఆర్థిక, ఆరోగ్య సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. గతంలో 650 హామీలిచ్చి, ఏ ఒక్కటైనా అమలు జరపని చంద్రబాబుకు ఓటేస్తే నష్టపోతారని హెచ్చరించారు. ప్రజలకు మంచి సేవ చేసిన, ప్రజల గుండెల్లో గుడి కట్టుకోవాలన్న సంకల్పంతో పని చేస్తున్న తన కుమారుడు రాజాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గాయపడిన, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురిని ఆమె పరామర్శించారు.

జనార్దన స్వామికి పూజలు

పెదపూడి: గ్రామంలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీసమేత జనార్దన స్వామి వారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు పెద్దింటి గోపాలచార్యులు ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.